క్లుప్తంగా

27న ఆశీల వేలం పాట

పార్వతీపురంటౌన్: ఆర్థిక సంవత్సరం 2024-25కు సంబంధించి పార్వతీపురం పురపాలక సంఘం ఆధీనంలో ఉన్న రోజువారీ మార్కెట్, రోడ్డు మార్జిన్, కబేళాల నందు ఆశీలు వసూలు చేసుకునే హక్కు కల్పించేందుకు బహిరంగ వేలం వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 27న ఉదయం 12గంటలకు పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు సదరు బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని, పూర్తి వివరాలకు కార్యాలయం పని వేళలో సంప్రదించవచ్చని సూచించారు.

ప్రమాద భరితంగా విద్యుత్ తీగలు


వైర్లు వేలాడుతున్నట్లు చూపిస్తున్న గ్రామానికి చెందిన తవుడు

సాలూరు రూరల్: మండలంలోని తోణాం కొత్తవలస, బొర్రమామిడివలస గ్రామాలకు విద్యుత్ సరఫరా లైన్లు ప్రమాదభరితంగా ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. అంతేకాకుండా ఈ విద్యుత్ లైన్లు పామాయిల్ తోట లోపలి నుంచి ఉండడంతో చిన్నగాలి వేసిన కొమ్మలు వైర్లపై పడి కరెంటు సరఫరా ఆగిపోతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలి వేసిందంటే రెండు గ్రామాల ప్రజలు చీకటిలో ఉండాల్సిందేనని విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన రెండుమూడు రోజుల వరకు అందుబాటులోకి రావడంలేదని చెబుతున్నారు. వెంటనే ఈ విద్యుత్ లైన్ రోడ్డు పక్క నుంచి వేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

జక్కువాని బంద పరిశీలన


జక్కువానిబంద రికార్డులను పరిశీలిస్తున్న జేసీ ఎస్.శోభిక

సీతానగరం: మండలంలోని కృష్ణారాయపురం రెవెన్యూ పరిధిలో ఉన్న జక్కువాని బందను జాయింట్ కలెక్టర్ ఎస్.శోభిక మంగళవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతులు గ్రీవెన్స్‌సెల్‌లో చేసిన ఫిర్యాదు మేరకు జాయింట్‌కలెక్టర్ శోభిక బందను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ బందకు సంబంధించిన వివరాలను లిఖిత పూర్వకంగా సమర్పించాలని తహసీల్దార్ శ్రీనివాసరావును ఆదేశించారు. కార్యక్రమంలో మండలసర్వేయర్ శంకరరావు, ఆర్‌ఐ ఎస్.శ్రీనివాసరావు, సర్పంచ్ జి.అన్నంనాయుడు, వీఆర్వో జి.బాబూరావు, రైతులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక బలోపేతానికి కృషి


వీవోఏలకు సూచనలిస్తున్న ఎంపీపీ సురేష్

జియ్యమ్మవలస: మహిళల ఆర్థిక బలోపేతానికి కృషి చేయాలని ఎంపీపీ బొంగు సురేష్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వీవోఏలు, మహిళా మండలి సభ్యులతో ఎంపీపీ బొంగు సురేష్ మంగళవారం సమావేశమై, కాసేపు మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు, ప్రోత్సాహకాలను వివరించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా మన పని మనం చేసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు లక్ష్మణరావు, కాద రామకృష్ణ, టీడీపీ మండల కన్వీనర్ పల్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి బాధ్యత హెచ్‌ఎంలదే..

వీరఘట్టం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి చేసే బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని ఎంఈఓ ఆర్.ఆనందరావు అన్నారు. మండలంలోని పలు పాఠశాలలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించాచారు. పాఠశాలల్లో ఉన్న మౌలిక వసతులు, సమస్యలపై ఆరా తీశారు. వంటలు రుచికరంగా ఉండేలా చూడాలని, మెనూ కచ్చితంగా అమలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

భామిని: భామినిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ ఎం.విజయనిర్మల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులంలోని 6,7,8,9 తరగతులలో 74 సీట్లు ఖాళీ ఉన్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 26న విద్యార్హత ధ్రువపత్రాలతో నేరుగా గురుకులంలో సంప్రదించాలని సూచించారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- అతిసార నియంత్రణపై రెండు నెలల పాటు విస్తృత ప్రచారం
- అధికారులకు కలెక్టర్ నిషాంత్‌కుమార్ సూచన

పార్వతీపురం:

వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉంది. సమస్య వచ్చిన తరువాత ఆస్పత్రుల చుట్టూ పరుగులు తీసేకన్నా ముందస్తు జాగ్రత్తలే శ్రీరామరక్ష అని వైద్యులు సూచిస్తున్నారు. తీవ్రమైన ఎండలు, అకస్మాత్తుగా వానలు కురిసి వాతావరణం చల్లబడడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే పరిస్థితి పొంచి ఉంది. ఇటీవల డయేరియా(అతిసారం) విజృంభిస్తోంది. దీనికి సకాలంలో చికిత్స అందించకపోతే ఒక్కోసారి ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ వైద్యాధికారులను ఆదేశించారు.

డయేరియా లక్షణాలు..

- నీళ్ల విరోచనాలు వస్తే డయేరియాగా అనుమానించాలి.
- రెండుమూడు విరోచనాలు అయినా, ఇతర లక్షణాలు ఉన్నా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- శరీరంనుంచి అధిక మొత్తంలో నీరు బయటకు పోవడంవల్ల వయస్సుతో సంబంధం లేకుండా డీ హైడ్రేషన్ కలుగుతుంది. దీనివల్ల పిల్లలు, వృద్ధులకు ఎక్కువగా ప్రమాదం జరుగుతుంది.
- డీహైడ్రేషన్‌కు గురైనప్పుడు అశ్రద్ధ చేస్తే నాడి వేగంగా, బలహీనంగా కొట్టుకోవడం లేదా ఒక్కోసారి నాడి తెలియకపోవడం జరుగుతుంది.

ఎందుకు వస్తుందంటే..

- కలుషిత నీరు, కలుషిత ఆహారం వల్ల డయేరియా వస్తుంది. ఈగలు వాలిన ఆహార పదార్థాలు తినడం వల్ల వ్యాధికారక క్రిములు జీర్ణ వ్యవస్థలోకి ప్రవేశించి, నీళ్ల విరోచనాలు వస్తాయి.
- అపరిశుభ్రత కారణంగా కూడా ఈ వ్యాధి ప్రబలే అవకాశం ఉంది.

చేతుల శుభ్రతపై అవగాహన

జిల్లాలో చేతుల శుభ్రతపై అంగన్వాడీ కేంద్రం, పాఠశాలల్లో చిన్నారులకు మంగళవారం అవగాహన కల్పించి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. శుభ్రత, వ్యక్తిగత పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. మార్కెట్‌లు, ఆహార పదార్థాలు విక్రయించే స్థలాలు, మురికివాడలు, తాత్కాలిక నివాసాలు ఉంటున్న వారిపై ప్రత్యేక దృష్టిసారించేలా అవగాహన కల్పిస్తున్నారు.


తాగునీటిని పరీక్షిస్తున్న వైద్యులు

నివారణ..

- పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలి.
- చేతులను తరచూ సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి
- బయట ఆహారం తినడం మంచిది కాదు
- ఉడకని మాంసం తినకూడదు
- కాచి చల్లార్చిన నీటిని వడబోసి తాగాలి
- శీతల పానీయాలు, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి
- పరిసరాల పరిశుభ్రత పాటించాలి

చర్యలు ముమ్మరం

జిల్లాలో డయేరియా, మలేరియా, డెంగీ, తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రణాళికను సిద్ధం చేశారు. అంగన్వాడీ కేంద్రాల పరిధిలో అంగన్వాడీ, ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు, జూలై 1నుంచి ఇంటింటికీ వెళ్లి గుర్తించిన చిన్నారులకు ఓఆర్‌ఎస్, జింక్ సప్లిమెంటరీ మాత్రలు అందజేయనున్నారు. అనుబంధ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో పరిసరాల పరిశుభ్రత, శుద్ధమైన తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోనున్నారు. మున్సిపల్, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమం, గ్రామీణ నీటి సరఫరా ఆధ్వర్యంలో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయనున్నారు. డయేరియా నివారణపై సమన్వయ శాఖల అధికారులతో కలెక్టర్ నిషాంత్ కుమార్ సోమవారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ మేరకు జూలై 1 నుంచి ఆగస్టు 31వరకు రెండు నెలల పాటు జిల్లా వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అవసరమైనప్పుడు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించేలా సిబ్బందిని కలెక్టర్ అప్రమత్తం చేశారు.


చేతులను శుభ్రం చేయిస్తున్న అంగన్వాడీ సిబ్బంది


చేతులు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు


చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

పైప్‌లైన్ మరమ్మతులు వేగవంతం

సీతానగరం: గ్రామాల్లో తాగునీరు సక్రమంగా పంపిణీ జరగక పోవడంతో పైపులైన్ల మరమ్మతులు వేగవంతంగా పూర్తిచేసి ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇంటింటికీ తాగునీరు సరఫరా చేయడానికి, కాలువల్లో పూడికలు తీయిస్తున్నామని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు మండలంలోని అంటిపేటలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులనుంచి ఫిర్యాదులు రావడంతో శిథిలమైన మంచినీటి పైప్‌లైన్ మరమ్మతులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు ఆదేశాల మేరకు అభివృద్ధి, మరమ్మతు పనులు జరుగుతున్నాయని వివరించారు. అందులో భాగంగా అంటిపేటలో ఇటీవల పైప్‌లైన్ మీదుగా రోడ్డు వేయడం వల్ల పైప్‌లైన్ శిథిలమై తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ జి.తిరుపతిరావు పర్యవేక్షణలో పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. మరమ్మతులు పూర్తి కావచ్చాయని, త్వరలో తాగునీరు సరఫరా పునరుద్ధరించనున్నట్లు తెలియజేశారు.


అంటిపేటలో కుళాయి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయిస్తున్న కార్యదర్శి శశిభూషణ్

గ్రామాల్లో పారిశుధ్యపనులు

వర్షాలు కురవడం వల్ల మండలంలోని గ్రామాల్లో మురుగునీరు స్తంభించిపోయి దోమలకు నిలయంగా ఉంటున్న ప్రాంతాలను గుర్తించి గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నామని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు మంగళవారం సుమిత్రాపురంలో సర్పంచ్ బి.నందిని ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి సోమేశ్వరరావు చేపట్టిన కాలువల్లో పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తం


ఉపాధ్యాయుల హాజరు పట్టీని పరిశీలిస్తున్న డీఈఓ జి.పగడాలమ్మ

- ఉపాధ్యాయులకు డీఈఓ ఆదేశాలు

సీతానగరం: పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబోధనతో పాటు వారి ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఈఓ జి.పగడాలమ్మ అన్నారు. ఈ మేరకు స్థానిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు, విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం వంటలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్దేశించిన సమయానికి పాఠ్యాంశాలను విద్యార్థులకు బోధించి విరామ సమయంలో రివిజన్ నిర్వహించాలని సూచించారు. విద్యాపరంగా వెనుకబడిన విద్యార్థుల్లో చదువుపట్ల ఆసక్తి కలిగే విధంగా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని చెప్పారు. అలాగే విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్నభోజన పథకానికి సంబంధించి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు నిర్దేశించిన గడువులోగా నిర్ణయించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాలు విద్యార్థులకు అందించాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలో టీఎల్‌ఎం విధానం ద్వారా పలుఅంశాలను ఉపాధ్యాయులు పరిగణనలోకి తీసుకుని జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, సహోపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్టీలను ఎంపిక చేయాలి

పార్వతీపురంటౌన్: ప్రతి విద్యా సంవత్సరంలో ఐటీడీఏతాజా నోటిఫికేషన్ జారీ చేసి సీఆర్టీల ఎంపిక చేపట్టాలని, సబ్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఐటీడీఏలో నమోదు చేసుకున్న అర్హత గల వారిని సీఆర్టీలుగా ఎంపిక చేయాలని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ వైస్ చైర్మన్ దుక్క సీతారాం కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేశారు.

రెగ్యులరైజేషన్ రద్దు చేయాలి

ఇటీవల జరిగిన సీఆర్టీల రెగ్యులరైజేషన్‌లో పార్ట్ టైమ్‌గా పని చేసిన వారు ఐదుగురు, 2012,13,14,15లలో పార్ట్ టైమ్‌గా చేసిన వారు అనేకమంది, వివిధ సబ్జెక్టులలో సీఆర్టీగా పనిచేసే స్కూల్ అసిస్టెంట్లు సబ్జెక్టు ప్రస్తవన లేకుండా సుమారు 13 మంది, సీఆర్‌టీలో హిందీ ఎల్‌పీ, లాంగ్వేజ్ పండిట్ గ్రేడ్ 2గా రెగ్యులర్ అయ్యారు. ఈ విధంగా అక్రమంగా, అనర్హతతో రెగ్యులర్ అయిన వారిపై విచారణ చేపట్టి రెగ్యులర్‌ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో బి. రామారావు, సీహెచ్ కృష్ణ, కె.బాబ్జీ, బి స్రవంతి, జి.మౌనిక, టి.అమరజ్యోతి, ఎం.దివ్య, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.


ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ జేఏసీ వైస్ చైర్మన్ దుక్క సీతారాం

చెరువుల ఆక్రమణదారులపై చర్యలు

- తహసీల్దార్ ఆనందరావు

పార్వతీపురం టౌన్: చెరువులు ఆక్రమించిన వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ కె.ఆనందరావు స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన పట్టణంలో ఆక్రమణకు గురైన లక్ష్మునాయుడు చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆక్రమణలకు గురైన చెరువులను పరిశీలిస్తామని, ఇప్పటికే కొన్ని చెరువుల్లో ఆక్రమణలు గుర్తించామని, బాధ్యులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. ఆయన వెంట ఆర్‌ఐ రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.


లక్ష్మునాయుడు చెరువులో ఆక్రమణలు పరిశీలిస్తున్న తహసీల్దార్

వైద్య పరికరాల వితరణ

గుమ్మలక్ష్మీపురం: స్థానిక వైటీసీలో గిరిశిఖర గ్రామాల గర్భిణుల వసతిగృహంలోని గర్భిణులకు అవసరమైన వైద్య పరికరాలను గరుగుబిల్లి మండలం, కొత్తూరు జనసేన పార్టీ నాయకుడు ఏగిరెడ్డి తిరుపతినాయుడు వితరణ చేశారు. ఆ పార్టీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కె.మల్లేశ్వరరావుతో కలిసి వైటీసీ మేనేజర్ ఎస్.రాముకు వాటిని మంగళవారం అందజేశారు. బీపీ పరీక్షించే పరికరంతో పాటు పల్స్‌ఆక్స్ మీటర్‌ను కూడా అందించామని, అలాగే అక్కడి గర్భిణులకు పండ్లు, రొట్టెలు కూడా ఇచ్చామని దాత తెలిపారు. గర్భిణుల వసతి గృహంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా నిరంతరం విద్యుత్ ఉండేలా ఇన్వర్టర్‌లు కూడా అందిస్తామన్నారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు అనీల్, శంకరరావు తదితరులు ఉన్నారు.


గర్భిణులకు రొట్టెలు, పండ్లు అందజేస్తున్న జనసేన పార్టీ నాయకులు

వినూత్న నిరసన

కొమరాడ: పార్వతీపురం-కూనేరు అంతర్‌రాష్ట్ర రహదారి మరమ్మతులు తక్షణమే చేపట్టాలని సీపీఎం నేత కొల్లు సాంబమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రానికి సమీపంలో రహదారిలో ఏర్పడిన భారీగుంతలోని మురుగునీటిలో శరీరానికి టేకుఆకులు కట్టుకుని, ఈతకొట్టి వినూత్నంగా నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం నుంచి రాయగడ వెళ్లే మార్గంలోని రహదారి చాలా అధ్వానంగా తయారైందని, ఇదే సమస్యను ఆర్‌అండ్‌బీ అధికారులకు ఎన్నిసార్లు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి పొడవునా ఏర్పడిన గుంతలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మూడు రాష్ట్రాలకు వెళ్లే భారీ వాహనాలు ఇదే రహదారిలో నిత్యం వస్తూ, వెళ్తుండడంతో రహదారి దారుణంగా తయారైందన్నారు. రోడ్డు బాగాలేని కారణంగా ట్రాఫిక్ సమస్యలు కూడా ఎక్కువవుతున్నాయన్నారు. ఇప్పటికైనా రహదారి మరమ్మతులు చేపట్టేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.


మురుగునీటిలో టేకుఆకులు కట్టుకుని, ఈదుతూ నిరసన తెలియజేస్తున్న సీపీఎం నేత సాంబమూర్తి

చిన్న పరిశ్రమల స్థాపనకు 35 శాతం సబ్సిడీపై రుణాలు

- జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ ఎల్‌ఎన్ మూర్తి

సీతానగరం: కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రాయితీపై కుటీర పరిశ్రమల ఏర్పాటుకు నిరుద్యోగులు, యువతీ యువకులకు అందజేస్తున్న రుణాలను వినియోగించుకోవాలని డీఆర్‌డీఏ పీడీ వై సత్యంనాయుడు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని పెదంకలాంలో సర్పంచ్ బి శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎల్‌ఎన్ మూర్తి బ్యాంక్ ఖాతాదారులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఆర్‌డీఏ పీడీ సత్యంనాయుడు మాట్లాడుతూ నిరుద్యోగ యువత, మహిళా సంఘాల సభ్యులు జీవనోపాధి పొందడానికి కేంద్రప్రభుత్వం బ్యాంక్‌ల ద్వారా 35 శాతం సబ్సిడీపై రూ.1 లక్ష నుంచి రూ.50 లక్షల వరకు రుణం సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు. రుణాలు పొందిన లబ్ధిదారులు సకాలంలో లావాదేవీలు నిర్వహిస్తే మరి కొందరికి రుణసదుపాయం కలుగుతుందన్నారు.

బీమా పథకాల్లో సభ్యులుగా చేరాలి

లీడ్ బ్యాంక్ మేనేజరు ఎల్‌ఎన్ మూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి, జీవన్ సురక్ష బీమా పథకంలో సభ్యులుగా చేరాలని కోరారు. ఆయా పథకాల్లో చేరిన సభ్యులు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.5 లక్షలు, సాధారణంగా మృతి చెందితే రూ.2 లక్షలు బీమా వర్తిస్తుందని చెప్పారు. పీఎంఈజీపీ పథకం ద్వారా ఉన్న స్కీంలో 35 శాతం సబ్సిడీపై రూ.1 లక్ష నుంచి రూ.50 లక్షల వరకు రుణాలు ఇవ్వడానికి బ్యాంక్‌లు సిద్ధంగా ఉన్నాయని తెలియజేశారు. యువతీ,యువకులు, నిరుద్యోగులు పొదుపు సంఘాల సభ్యులు పాడిపరిశ్రమ, మేకల పెంపకం, కోళ్ల పరిశ్రమ, టెంట్‌హౌస్‌లు, టైలరింగ్, పిండి మరలు, బేకరీ షాపు నిర్వాహణకు రుణాలు మంజూరు చేయనున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రుణాలు పొందడానికి సమీపంలో ఉన్న బ్యాంక్‌లను లేదా లీడ్ బ్యాంక్‌ను సంప్రదించాలని కోరారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ వై. సత్యంనాయుడు

పైనాపిల్ విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ


శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువత

సీతంపేట: పైనాపిల్ విలువ ఆధారిత ఉత్పత్తులపై గిరిజన యువతకు శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస కృషీ విజ్ఞాన కేంద్రంలో రెండు రోజుల వృత్తి శిక్షణ ఇస్తున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో అడ్డంగి, కొండూర గ్రామాల నుంచి 20 మంది గిరిజన యువతను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇస్తున్నట్లు గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత తెలిపారు. పైనాపిల్‌లో ఉండే ఆస్కార్బిక్ ఆమ్లం, పీచు పదార్థాలు రోగనిరోధక శక్తిని మెరుగుపరచడంతో పాటు జీర్ణక్రియ సక్రమంగా జరిగేలా చూస్తాయన్నారు. క్యాన్సర్‌ను నియంత్రించే కారకాలు పైనాపిల్‌లో పుష్కలంగా ఉంటాయన్నారు. జూన్ నుంచి ఆగస్టు వరకు పైనాపిల్ పంట దిగుబడి ఉంటుందని, పైనాపిల్ నుంచి జామ్, స్క్వాష్, క్యాండీ, తదితర ఉత్పత్తుల తయారీపై గిరిజన యువతకు శిక్షణ ఇస్తున్నామన్నారు. దీని వల్ల యువతకు ఉపాధి లభిస్తుందన్నారు.

జిల్లా కేంద్రంలో స్టాప్ డయేరియా

పార్వతీపురంటౌన్: పట్టణంలో స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని 30 వార్డుల్లో వాటర్ ట్యాంకుల వద్ద జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో ఉన్న తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో క్లోరినేషన్ చేపడుతున్నట్లు చెప్పారు. ఎమినిటీ సెక్రటరీల ద్వారా వాటర్ పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి వాటి మరమ్మతులు చేయించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. పైప్‌లైన్ల క్లీనింగ్, వాటర్ క్లోరినేషన్ కూడా జరుగుతోందని చెప్పారు. వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు, మేస్త్రీలు దగ్గరుండి వార్డులలో డిసిల్టింగ్ పనులు, యాంటీ లార్వా స్ప్రేయింగ్, ఫాగింగ్ పూర్తిస్థాయిలో జరిగే విధంగా చూసుకోవాలని ఆదేశించామని వివరించారు.


తాగునీటి ట్యాంకుల పరిశుభ్రతను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

'ఉపాధి' పనుల అక్రమాలపై విచారణ

జియ్యమ్మవలస: మండలంలోని కుందరతిరువాడ గ్రామంలో ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు జరిగాయని వెల్లువెత్తిన ఆరోపణలపై ఏపీవో శ్రీనివాసరావు మంగళవారం విచారణ చేపట్టారు. ఉపాధి పనుల వేతనదారులతో సమావేశమై, ఆరోపణలు నిజమా.. కాదా.. అని ఆరాతీశారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ఇటీవల చేసిన ఆరోపణల నేపథ్యంలో గ్రామంలో ఈ విచారణ చేపట్టినట్లు సమాచారం.


వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీవో శ్రీనివాసరావు

నీతిఅయోగ్ సూచనలు కచ్చితంగా అమలు చేయాలి

భామిని:

నీతిఅయోగ్ సూచనలను కచ్చితంగా అమలు చేయాలని ఎంపీడీఓ కె.కిశోర్‌కుమార్, ఏస్పరేషన్ బ్లాక్ కోఆర్డినేటర్ కె.మహేశ్వరరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆశావహ సమితుల అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. హెల్త్, న్యూట్రిషియన్, విద్య, వ్యవసాయం, సోషల్ డిమాలిస్ వంటి అంశాలపై శాఖల వారీగా సమీక్షించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ కృష్ణారావు, వైద్యాధికారి డాక్టర్ పి.సోయల్, ఎంఏఓ కిమిడి మన్మథరావు, హౌసింగ్ ఏఈ చంద్రశేఖరనాయుడు, ఎంఈఓ ఎ.శ్రీనివాస్, ఐసీడీఎస్ ఎస్ఓ వరలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అమరాన సందీప్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కిశోర్‌కుమార్